సాక్షి
కర్నూలు
శుక్రవారం : 6 : జూన్ : 2025



వెండర్ టెండర్.. రూటే సప'రేటు'
నాలుగు జిల్లాల స్టాక్ హోల్డింగ్ వెండర్ టెండర్‌ను దక్కించుకున్న ఆయన రూటే సప'రేటు'. ఈ స్టాంపులు కావాలంటే తన ఖాతా పేరిట రిజిస్ట్రేషన్ చలానాలు కట్టాలని తెగేసి చెబుతున్నాడు. 10లో▸



క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్
క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు గురు వారం అరెస్ట్ చేశారు. ఈ నెల 3వ తేదీన జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌పై ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని జైలుకు పంపారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,600.11
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:21.612
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,905
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:246

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం కారిడార్‌లో భక్తుల రద్దీ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం భక్తులతో పోటెత్తింది. గురువారం ప్రత్యేకం కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో రావడంతో మంత్రాలయ క్షేత్రం కిక్కిరిసింది. తుంగభద్ర నదికి వరద నీరు రావడంతో నదీతీరంలో భక్తుల కోలాహలం కనిపించింది. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, ఆ తర్వాత రాఘవేంద్రుల మూల బృందావన దర్శనాలు చేసుకున్నారు. రాఘవేంద్రుల దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అన్నపూర్ణభోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లతో భక్తులు బారులు తీరారు.

9న విత్తనాల కోసం ఆందోళన

కర్నూలు(సెంట్రల్): రైతులకు నాణ్యమైన విత్తనాలను 90 శాతం సబ్సిడీపై సరఫరా చేయాలని కోరుతూ జూన్ 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం తెలిపారు. గురువారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో ఆందోళన కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లు ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడినా విత్తనాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వకుండా జాప్యం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ అధికారిగా కొండయ్య



కర్నూలు(అర్బన్): జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారత అధికారిగా శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ పీఏగా విధులు నిర్వహిస్తున్న పి.కొండయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ శాఖకు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా ఆర్థిక సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి దేవి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

డీఐఈఓకు ఆర్ఐఓ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌బాబు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తి విద్యాధికారిగా పని చేస్తున్న డా.సి. సురేష్ బాబును జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా నియమిస్తూ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి (ప్రస్తుతం ఈ పోస్టును డీఐఈఓగా మార్పు చేశారు)గా పని చేస్తున్న జీవీఎస్ గురువయ్య శెట్టి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వివిధ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు లాలెప్ప, పరమేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 835 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం గురువారం సాయంత్రం సమయానికి 835 అడుగులకు చేరుకుంది. బుధవారం నుంచి గురువారం వరకు ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 19,785 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 4,598 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 0.906, ఎడమగట్టు కేంద్రంలో 0.842 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 867 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 55.0470 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): కరోనా సమయంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 7,8 తేదీల్లో సంతకాల సేకరణ, 9న రైల్వే స్టేషన్ల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

కంగారు పెడుతున్న కరోనా!

జిల్లాలో ఏడుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ

- అనేక మందికి వ్యాధి లక్షణాలు
- జీజీహెచ్‌ను ఆశ్రయిస్తున్న రోగులు
- జేఎన్1 వైరస్‌గా అనుమానం
- ఇప్పటికే 20 పడకలతో ప్రత్యేక వార్డు
- నామమాత్రంగా కోవిడ్ పరీక్షలు
- వంద పరీక్ష కిట్లతో సరిపెట్టిన ప్రభుత్వం

కోవిడ్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. క్రమంగా పెరుగుతున్న కేసుల సంఖ్య ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాధి లక్షణాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య అధికంగానే ఉంటోంది. నాలుగైదేళ్ల క్రితం ఆ మహమ్మారి సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ప్రాణాలు, ఆరోగ్యం, ఆర్థికం ఇలా అన్ని రంగాలను కుదేలు చేసింది. దీని దాటికి ఎన్నోవేల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. లక్షలాది మంది తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడ్డారు. చికిత్స చేయడానికి కనుచూపు మేరలో డాక్టర్ కనిపించని పరిస్థితి. ఉన్నా ఆసుపత్రిలో పడకలు లభించని దుస్థితి. ఇలాంటి వైరస్ మళ్లీ వస్తోందన్న ప్రతిసారీ ప్రజల గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఇప్పుడు కూడా వారం రోజులుగా దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ వైరస్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడం గమనార్హం.



కర్నూలులో మాస్క్ ధరించి వెళ్తున్న యువతి

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్ మహమ్మారి మరోమారు భయపెడుతోంది. ఈ విషయంలో ఉన్నతస్థాయి ఆదేశాలతో అధికారులు నోరు మెదపని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం విస్తరిస్తున్న జేఎస్-1 వైరస్ వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండబోదని భరోసా కల్పిస్తున్నా.. ఎప్పుడు ఎలా విజృంభించి ప్రాణాలను తీస్తుందోననే భయం వెంటాడుతోంది. ప్రజలు కోవిడ్ బారిన పడితే చికిత్స అందించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నా.. నామమాత్రమేనని తెలుస్తోంది. ఆసుపత్రిలోని పాత గైనిక్ విభాగంలో 20 పడకలతో కోవిడ్ వార్డుగా మార్చుచేసి.. ప్రతి పడకకూ ఆక్సిజన్ పైప్ లైన్ ఏర్పాటు చేసి మమ అనిపించారు. ఆసుపత్రిలోని పూర్వ ఐడీ వార్డులో ఏర్పాటు చేసిన నెగిటివ్ ప్రెజర్ రూమ్ నిరుపయోగంగా ఉంది. గతంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ట్యాంకులు పనిచేస్తున్నాయో లేదో కూడా ఇప్పటి వరకు తెలుసుకోని పరిస్థితి. అప్పటి ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు పనిచేయడం లేదని సమాచారం. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ సరిపోతుందనే భావనలోనే అధికారులు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.



కోవిడ్ విభాగంలోని పడకలు

చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కోవిడ్ లక్షణాలతో ఇటీవల పలువురు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరికి ఉన్న లక్షణాలను గుర్తించిన వైద్యులు కోవిడ్‌గా నిర్ధారించి చికిత్స రాసి పంపుతున్నారు. అంతేగానీ లక్షణాలతో వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించడం లేదు. తప్పనిసరైతే తప్ప రోగులకు కోవిడ్ కిట్ల ద్వారా పరీక్షించకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఇటీవల ఆసుపత్రికి వంద టెస్ట్ కిట్లను మాత్రమే పంపడం చూస్తే కోవిడ్‌ను అడ్డుకోవడంలో ఎంతటి చిత్తశుద్ధితో ఉందో అర్థమవుతోంది. కోవిడ్ లక్షణాలతో వచ్చిన వారిని గతంలో ప్రత్యేకంగా ఓపీ నెం.99ను క్రియేట్ చేసి అందులో పరీక్షించేవారు. ప్రస్తుతం ఆ ఏర్పాట్లు లేవు. జనరల్ ఓపీల్లో సాధారణ రోగుల తరహాలోనే పరీక్షిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.



కోవిడ్ విభాగం

పీహెచ్‌సీల్లో కానరాని ఏర్పాట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వస్తోందంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఏర్పాట్లు చేసేవారు. కానీ ప్రస్తుతం జిల్లాలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కోవిడ్‌ను ప్రాథమికంగా నిర్ధారించేందుకు కనీసం ర్యాపిడ్ కిట్లు అందుబాటులో లేవు. లక్షణాలను బట్టి రోగులకు యాంటిబయాటిక్స్, పారాసిటమాల్, స్టెరాయిడ్స్ ఇచ్చి పంపుతున్నారు. గతంలో జిల్లాలో అందరికీ వ్యాక్సినేషన్ పూర్తి చేశామని, అందరికీ ఇమ్యూనిటీ వచ్చి ఉంటుందని, కాబట్టి ఎలాంటి కోవిడ్ వైరస్‌లు వచ్చినా ఏమీ కాదనే ధీమాలో అధికారులు ఉన్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి కూడా కోవిడ్ గురించి ఎవ్వరూ ఏమీ మాట్లాడవద్దని, ప్రకటనలు కూడా ఇవ్వవద్దని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఏడుగురికి పాజిటివ్

- ➤ ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధునికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో చికిత్స పొందుతున్నాడు.
- ➤ మంత్రాలయం మండలం పారందొడ్డి గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువతికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఆ మేరకు చికిత్స అందిస్తున్నారు.
- ➤ కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న 54 ఏళ్ల ఓ వైద్యురాలు కోవిడ్ బారిన పడ్డారు. ఈమె హోమ్ ఐసోలేషన్‌లో ఉండి చికిత్స తీసుకుంటున్నారు.
- ➤ కర్నూలు మండలం దిన్నెదేవరపాడుకు చెందిన 25 ఏళ్ల వ్యక్తికి, గోనెగండ్లకు చెందిన 45 ఏళ్ల వ్యక్తికి, కర్నూలుకు చెందిన 20 ఏళ్ల యువతికి, అనంతపురం జిల్లా పెద్దవడుగూరుకు చెందిన 49 ఏళ్ల వ్యక్తికి గురువారం పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇందులో ఒక పీజీ వైద్య విద్యార్థిని ఉన్నారు.

కర్నూలు పెద్దాసుపత్రిలో కోవిడ్ కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2020	6,607
2021	9,206

(గమనిక: 2022లో మూడో వేవ్ వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేదు.)

165 16ఏళ్లలోపు యువకులు	**5,709** 60 ఏళ్లు పైబడిన వృద్ధులు
9,939 16-60 ఏళ్ల మధ్య వయస్సు వాళ్లు	**1,037** పాజిటివ్ డయాలసిస్ పేషెంట్‌లు

897 పాజిటివ్ గర్భవతులు

1.45 లక్షలు ఉమ్మడి జిల్లా కోవిడ్ కేర్ సెంటర్‌లు, ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన కోవిడ్ బాధితులు

876 రెండు వేవ్‌లలో మరణాలు

అప్రమత్తంగానే ఉన్నాం



ప్రస్తుతం జిల్లాలో కోవిడ్ కేసులు నమోదు కాలేదు. ఇప్పటి వరకు కొంత మందికి పరీక్ష చేసినా ఎవ్వరికీ పాజిటివ్ రాలేదు. కోవిడ్ కేసులు వస్తే చికిత్స అందించేందుకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. అనుమానిత లక్షణాలున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన ఆక్సిజన్, మందులు, పీపీఈ కిట్లు, సర్జికల్స్ సిద్ధంగా ఉన్నాయి.
– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

అప్కాస్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఆప్కాస్ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఆప్కాస్ ఇంజినీరింగ్ ఉద్యోగులు 30 రోజులుగా నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో రెండు రోజుల క్రితం సమ్మె బాట పట్టారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్కాస్ కింద పనిచేసే ఉద్యోగులకు రూ.13 వేల వేతనం మాత్రమే చెల్లిస్తుండటం దారుణమన్నారు. రేషన్ కార్డులు మంజూరు చేస్తే ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ ఫలాలు అందుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇతర సిబ్బందికి లభిస్తున్న 69 సెలవులను మంజూరు చేయాలన్నారు. ఉద్యోగంలో మరణించిన వారి కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్వీ వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి షరీఫ్, మైనార్టీ నగర అధ్యక్షుడు పట్టా బాషా కంటూ, బాబు, మధు, శివ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

కర్నూలు సిటీ: మెగా డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నేటి నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు మొత్తం 17 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలులో 6 కేంద్రాలు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో ఒక్కో కేంద్రాన్ని, హైదరాబాద్‌లో 9 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు వీలుగా ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు ప్రధాన రహదారుల్లోని సర్కిల్స్ వద్ద రూట్లు తెలుసుకునేందుకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 2,645 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 55,177 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలాఉంటే పరీక్షలకు నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించేదిలేదని డీఎస్సీ పరీక్ష జాయింట్ డైరెక్టర్, కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఇప్పటికే ప్రకటించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. గురువారం నగర శివారులోని నగర వనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, జిల్లా అటవీ శాఖ అధికారిణి పి.శ్యామల నగర వనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 'ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నగర వనంలో చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్, అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్, నగర పాలక సంస్థ కమీషనర్ రవీంద్రబాబు, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దారి'న పడని ఏపీఆర్ఆర్‌పీ పనులు

గత ప్రభుత్వంలో రూ.295.64 కోట్లతో ప్రారంభం

- 139 పనుల్లో ఏడాది క్రితమే 76 పూర్తి
- మిగిలిన పనులు పూర్తి చేయని కూటమి ప్రభుత్వం
- సేఫర్ స్టేజ్ ముసుగులో కాలయాపన
- రూ.196 కోట్ల పనులను రూ.51 కోట్లకు కుదింపు



రూ.20.11 కోట్లతో ప్రతిపాదనలు పంపిన గోరంట్ల బ్రిడ్జి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు(ఏపీఆర్ఆర్‌పీ) కింద చేపట్టిన గ్రామీణ రోడ్ల పనుల్లో తీవ్ర సందిగ్ధం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఈ పనులను పూర్తి చేయలేక, 'సేఫర్ స్టేజ్' పేరిట కాలయాపన చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లాలో రూ.295.64 కోట్లతో 19 ప్యాకేజీల్లో 139 పనులను చేపట్టారు. ఇందులో 329.77 కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు, పలు బ్రిడ్జీలు నిర్మించేందుకు పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మొత్తం పనుల్లో రూ.12,818.79 లక్షల అంచనాతో రూపొందించిన 76 పనులు పూర్తయ్యాయి. ఈ పనులకు సంబంధించి అప్పట్లోనే రూ.5,946.79 లక్షల బిల్లులను కూడా చెల్లించారు. ఇంకా చేసిన పనులకు సంబంధించి రూ.2,761.48 లక్షల బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ బిల్లులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. మిగిలిన 63 పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ పనులను పూర్తి చేయలేక 'సేఫర్ స్టేజ్' పేరిట పలు కారణాల వల్ల ప్రారంభం కాని పనులను నిలుపుదల చేస్తూ, పురోగతిలో ఉండి ఆగిపోయిన పనులను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మాత్రమే చేపట్టేందుకు నిర్ణయించారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.19,695.32 లక్షలతో పూర్తి చేయాల్సిన పనులను రూ.5,164.98 లక్షలకు కుదించి ప్రతిపాదనలు పంపారు. అయితే నెల రోజులు కావస్తున్నా ఈ పనులకు కూడా ఆమోదం లభించని పరిస్థితి నెలకొంది.

రద్దయిన 29 పనులు

ఏపీఆర్ఆర్‌పీ గ్రాంట్ కింద మంజూరై, వివిధ కారణాల వల్ల ప్రారంభం కాని పనులను సేఫర్ స్టేజ్‌లో రద్దు చేశారు. మొత్తం ఏడు ప్యాకేజీల్లో రూ.3,888.83 లక్షల విలువైన 29 పనులు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలోనే పురోగతిలో ఉన్న బిలో గ్రావెల్ సబ్ బేస్ కింద ఉన్న 9 పనులను సేఫ్ క్లోజింగ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్తయిన పనులు


ప్యాకేజీ నెంబర్	పూర్తయిన పనులు	అంచనా మొత్తం (రూ.లక్షల్లో)
40	23	రూ.3,663.60
41	35	రూ.4,333.99
42	10	రూ.1,851.33
43	06	రూ.596.03
44ఏ	01	రూ.1,503.74
44సీ	01	రూ.870.10
మొత్తం	76	రూ.12,818.79

పల్లె పండుగ బిల్లులకు గ్రహణం

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో రూ.150.04 కోట్లతో 1,916 పనులు చేపట్టారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.23.75 కోట్లు మాత్రమే విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్ 14న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అంతర్గత రోడ్ల నిర్మాణాలకు భూమి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే శరవేగంగా పనులను పూర్తి చేశారు. అయితే ఐదు నెలలు గడచినా బిల్లులు విడుదల చేయకపోవడం గమనార్హం.



రూ.8.70 కోట్లతో నిర్మించిన ఏ గోకులపాడు బ్రిడ్జి



రూ.3.50 కోట్లతో నిర్మించిన డోన్ నుంచి గోవర్ధనగిరి వయా వెంకటనాయునిపల్లె రోడ్డు

రూ.51.64 కోట్లతో ప్రతిపాదనలు



ఏపీఆర్ఆర్‌పీ పనులను సేఫర్ స్టేజ్‌లో పూర్తి చేసేందుకు ఈఎన్‌సీ ఆదేశాల మేరకు రూ.51.64 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం లభించిన వెంటనే ఆరు ప్యాకేజీల్లో అసంపూర్తిగా ఉన్న పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా చేపడతాం. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పూర్తి చేసిన పనులకు బిల్లులు మరో పదిహేను రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. – వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ

క్లుప్తంగా

కౌలు రైతు ఆత్మహత్య


హరిబాబు (ఫైల్)

దేవనకొండ: మండలంలోని వెలమకూరు గ్రామ సమీపంలో కౌలు రైతు బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన బోయ హరిబాబు(36) వెలమకూరు గ్రామంలో ఆర్ఎంపీగా జీవనం సాగిస్తూ అక్కడే కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలు సరిగా పండక సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని చెల్లించే మార్గం లేక గ్రామ శివారులోని జమ్మి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

కర్నూలు (అర్బన్): నగరంలోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని టెలికాం నగర్‌లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. కాలనీకి చెందిన సుశీలమ్మ తమ ఇంటికి సమీపంలోని టైలర్ షాప్‌నకు వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తున్న సమయంలో అదే దారిలో నడుచుకుంటూ వచ్చిన అగంతకుడు ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జైలు శిక్ష

మంత్రాలయం రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన నలుగురికి ఎమ్మిగనూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించారు. మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగుతూ రాఘవేంద్రపురానికి చెందిన మల్లికార్జున, హనుమంతుతో పాటు నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన రాముడు, దాసరి మల్లికార్జున పట్టుబడ్డారు. గురువారం వారిని కోర్టులో హాజరు పర్చగా ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు.

వైద్యం కోసం వెళ్తూ మార్గమధ్యంలో..


మృతి చెందిన హుస్సేన్‌బాషా

బండి ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆస్పత్రికి వెళ్తూ మార్గమధ్యలో మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వెలుగోడు మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన హుసేన్‌బాషా (33) పాత ఇనుము సామగ్రి వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు గురువారం హుసేన్‌బాషాను తీసుకుని ద్విచక్రవాహనంపై చికిత్స నిమిత్తం నంద్యాలకు బయలుదేరారు. బండి ఆత్మకూరు గ్రామ సమీపానికి చేరుకోగానే అతడిలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కాలుష్య కాసారం


సోమిరెడ్డి నగర్ వద్ద ఫెన్సింగ్ ఊడిపోయిన దృశ్యం


కేవీఆర్ కాలేజీ సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు


లక్ష్మీనగర్ ఏరియాలో పేరుకుపోయిన చెత్త, పాచి


దేవనగర్ వినాయక ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్త


కార్ల్ మార్క్స్ నగర్‌లో వాకింగ్ ట్రాక్‌పైనే షెడ్లు వేసి నిలిపిన వాహనాలు

ఒకవైపు వర్షాలు కురుస్తున్నా, వ్యాధులు ప్రబలుతున్నా.. అధికారుల్లో చలనం కరువైంది. పారిశుద్ధ్య చర్యలపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న కేసీ కెనాల్ దుస్థితి చూస్తే ప్రజారోగ్యంపై అధికారుల చిత్తశుద్ధి ఇట్టే అర్థమవుతుంది. కర్నూలు నగరం చుట్టూ కేసీ కెనాల్ ప్రవహిస్తుంది. సుంకేసుల నుంచి కడప వరకు సాగునీరు అందించే కేసీ కెనాల్‌ను కర్నూలు ప్రజలు మురికి కాలువగా మార్చేశారు. కార్ల్ మార్క్స్ నగర్ నుంచి జొహరాపురం వరకు కేసీ కెనాల్‌లో చెత్త, పాచి పేరుకుపోయింది. చుట్టూ కంప చెట్లతో అక్కడక్కడా ప్రమాదాలు జరగకుండా వేసిన ఫెన్సింగ్ తుప్పు పట్టి విరిగిపోయి కనిపిస్తోంది. అలాగే వాకింగ్ ట్రాక్ మొత్తం బంకులు, కొట్టాలు, పార్కింగ్ షెడ్లు, ఎడ్లకు నివాసాలుగా మారాయి. అక్కడక్కడా మురికి కాలువల నీరు కూడా కేసీ కెనాల్‌లో కలవడంతో ఆగిపోయిన నీటిపై దోమల బెడద ఎక్కువైంది. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల ముప్పు పొంచిఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కాలుష్య కాసారంగా మారిన కేసీ కెనాల్‌ను శుభ్రం చేయాలని పర్యావరణవేత్తలు, నగర ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


స్విమ్మింగ్ ఫూల్ సమీపంలో కంచె ఏర్పాటు చేయని దృశ్యం


ధర్మపేట సమీపంలో పడేసిన చెత్త


గణేష్ నగర్ సమీపంలో పాచి పట్టిన దృశ్యం

మత్తు పదార్థాలను అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో మత్తు పదార్థాల సాగు, రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశంలో గంజాయిసాగు, రవాణా, నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకంపై జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో కలిసి అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సహరించాలన్నారు. హెల్త్, ఎక్సైజ్, మునిసిపల్ శాఖలు తమ ప్రతి కార్యక్రమంలో ఈ అంశాన్ని ఎజెండాగా చేర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ వినియోగించినా, గంజాయి సాగు చేసినా సంబంధిత వీఆర్వోతోపాటు సర్పంచ్‌లపై కూడా కేసులు పెట్టే అవకాశం ఉందని, అందువల్ల అందరూ జాగ్రత్తగా ఉండి మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహరించాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ముద్రించిన పోస్టర్లను సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. జనరల్‌హాస్పిటల్‌లో ఉన్న డిఅడిక్షన్ సెంటర్‌కు సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిఅడిక్షన్ సెంటర్‌లో టెస్టింగ్ కిట్స్ లేకపోతే వాటిని కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో డ్రగ్స్ తీసుకోవడంతో కలిగే దుష్పరిణామాలను గోడల మీద రాయించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పంట సీజన్ మొదలవడంతో గంజాయి సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థలో ఈగల్ బృందాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో 7 ఎన్‌డీపీఎస్ కేసులను గుర్తించామన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర రవీంద్రబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- రూ.3,40,000 నగదు స్వాధీనం


బెట్టింగ్ రాయుళ్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోడుమూరు రూరల్: క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3,40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఇన్‌చార్జ్ సీఐ మన్సురుద్దీన్ విలేకరులకు వెల్లడించారు. కోడుమూరుకు చెందిన గుజరాతి వినోద్‌కుమార్, మాదిగుండు వేణుగోపాల్, కోసూరు సోమశేఖర్, పలవారి భాస్కర్‌రెడ్డి ఈనెల 3న జరిగిన ఐపీఎల్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను టీవీలో చూస్తూ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా ఎస్ఐ ఎర్రిస్వామి తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తేలడంతో బెట్టింగ్‌లో పెట్టిన రూ.3,40,000 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. బెట్టింగ్ రాయుళ్లను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ ఎర్రిస్వామి, ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు మద్దేశ్వర్, మహబూబ్‌బాషా, మురారి, కానిస్టేబుళ్లు జగదీష్, విజయకుమార్, భాస్కర్, ఓంకార్‌లను సీఐ అభినందించారు.

వెండర్ టెండర్.. రూటే సప‘రేటు’

- స్టాంపులు కావాలంటే రిజిస్ట్రేషన్ చలానాలు తన ఖాతా మీద కట్టించాలని షరతు
- కట్టకపోతే స్టాంపులు ఇవ్వకుండా వేధింపులు
- రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో అటు నాన్ జ్యుడీషియల్.. ఇటు ఈ-స్టాంపులు దొరక్క విక్రయదారుల తీవ్ర ఇబ్బందులు

ఈ స్టాంపింగ్ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఉద్యోగి, నాలుగు జిల్లాల స్టాక్ హోల్డింగ్ వెండర్ టెండర్‌ను దక్కించుకున్న నర్సిరెడ్డి రూటే సప‘రేటు’. ఈ స్టాంపులు కావాలంటే తన ఖాతా పేరిట రిజిస్ట్రేషన్ చలానాలు కట్టాలని మిగతా వెండర్లకు తెగేసి చెబుతున్నాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోకపోవడంతో అందులోని మర్మమేమిటో తెలియడంలేదు. ఆయన వ్యవహార శైలితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద తరచూ స్టాంపుల కొరత నెలకొంటోంది.

– కర్నూలు(సెంట్రల్)


ఈస్టాంపింగ్ ప్రింట్

కర్నూలు, నంద్యాల, అనంతపురం, ప్రకాశం జిల్లాల(మార్కాపురం నియోజకవర్గం)కు సంబంధించిన ఈస్టాంపింగ్ వెండర్ టెండర్‌ను నర్సిరెడ్డి దక్కించుకున్నారు. అతడు తన వెండర్ ద్వారా క్రయ, విక్రయాదారులకు ఈస్టాంపులను సరఫరా చేయాల్సి ఉంది. అయితే తన ఖాతాలో రిజిస్ట్రేషన్లకు వినియోగించే చలాన్లను కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం ఉంటుంది. ఈ-స్టాంపులు, చలాన్ల విక్రయాలకు ప్రభుత్వం తగిన పరిహారం చెల్లిస్తుంది. అయితే ఈ-స్టాంపింగ్‌ల కంటే చలాన్లపైనే అతడికి కమిషన్ ఎక్కువగా ప్రభుత్వం చెల్లిస్తోంది. దీంతో తన దగ్గర ఈ-స్టాంపులు కావాలంటే రిజిస్ట్రేషన్లకు వినియోగించే చలాన్లను కూడా తన ఖాతా పేరిట కట్టించాలని షరతు విధిస్తున్నాడు. దీంతో కొందరు కొన్ని చలాన్లను కట్టించైనా తీసుకెళ్తున్నారు. కొందరు ఏమీ కట్టించకుండా స్టాంపులను కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో కొర్రీ వేస్తున్నాడు. నాలుగు జిల్లాలపై దాదాపు 150 మందికి పైగా వెండర్లు ఉంటారు. వారందరూ అతని బాధితులే.


కర్నూలు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

పెండింగ్‌లో రిజిస్ట్రేషన్ దరఖాస్తులు

ఈ-స్టాంపింగ్ వెండర్ కోసం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. వారికి వెండర్ పర్మిషన్‌ను అతడే ఇవ్వాలి. అయితే వచ్చిన అర్జీలను అతడు తొక్కిపెట్టి ఉన్న వెండర్లలో కొందరికి ఈస్టాంపులు ఇచ్చి మిగతా వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా దరఖాస్తుదారులు వచ్చి తమ రిజిస్ట్రేషన్ పని ఎంత వరకు వచ్చిందని అడిగితే కనీస సమాచారం ఇవ్వడంలేదని తెలుస్తోంది. నర్సిరెడ్డి వ్యవహారంపై కొందరు రిజిస్ట్రేషన్ శాఖ ఆయా జిల్లాల రిజిస్ట్రార్లు, డీఐజీలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది.

కొన్ని సమయాల్లో కృత్రిమ కొరత..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని సమయాల్లో స్టాంపుల కొరత వస్తూ ఉంటోంది. ఇందుకు కారణం అటు ప్రభుత్వం నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను సరఫరా చేయకపోవడం..ఇటు ఈస్టాంపింగ్ స్టాక్ హోల్డర్ తన స్వార్థంతో ఈస్టాంపులను సక్రమంగా సరఫరా చేయకపోవడమేనని తెలుస్తోంది. నెలలో ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఒక్కోసారి దాదాపు ఐదారు రోజులు స్టాంపుల కొరత ఏర్పడుతుంది. కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద అయితే వారంలో ఒక్కరోజైనా స్టాంపుల కొరత ఉంటుందని బాధితులు వాపోతున్నారు.

దరఖాస్తు చేశాం



ఈ-స్టాంపింగ్ వెండర్ స్టాక్ పాయింట్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేశాను. ఇంత వరకు అనుమతి ఇవ్వలేదు. ఎప్పుడు వెళ్లి అడిగినా కనీసం సమాచారం ఇవ్వడు. అస్సలు ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తున్నాడు. అతని తీరు ఏ మాత్రం బాగోలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. – పాల మహ్మద్‌రఫీ, బండి ఆత్మకూరు

నెల రోజులుగా స్టాంపులు దొరకడంలేదు



నేను పొలం కొన్నాను. దానికి సంబంధించి అగ్రిమెంట్ కోసం వెళ్తే స్టాంపులు లేవంటున్నారు. నెల రోజులుగా వెలుగోడులో స్టాంపులు దొరకడంలేదు. దీంతో స్టాంపుల కోసం పనులు మానుకొని నంద్యాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడంలేదు.
– రామస్వామిరెడ్డి, అబ్దుల్లాపురం, వెలుగోడు మండలం

8న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 8వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా బాలుర, బాలికల ఫుట్ బాల్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్ బాల్ కోచ్ బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010–11 సంవత్సరాల మధ్యన జన్మించి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో వెంట తీసుకురావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 98662 11480 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

17 మంది తహసీల్దార్ల బదిలీ

- కలెక్టరేట్ ఏఓగా ఆర్.శివరాముడు
- నంద్యాల జిల్లా నుంచి ఇద్దరు తహశీల్దార్లు, ఒక్క డిప్యూటీ తహశీల్దార్ కేటాయింపు

కర్నూలు(సెంట్రల్): సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో 17 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి గత సెప్టెంబర్ లోనే బదిలీలు జరిగాయి. అయితే చాలా చోట్ల ప్రజాప్రతినిధులకు తహసీల్దార్లకు పొసగకపోవడంతో మళ్లీ పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టడం గమనార్హం. కలెక్టరేట్ ఏఓగా విజయశ్రీ స్థానంలో ఆదోని తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆర్.శివరాముడును నియమించారు. ఇక్కడ పని చేస్తున్న విజయశ్రీని నంద్యాల జిల్లాకు కేటాయించారు. అలాగే కర్నూలు అర్బన్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.గిరికుమార్‌రెడ్డిని నంద్యాల జిల్లాకు కేటాయించడం గమనార్హం. ఇతను కర్నూలు జిల్లా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. అయితే అనుకోకుండా నంద్యాలకు కేటాయించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు నంద్యాల జిల్లా నుంచి కలెక్టరేట్ ఏఓగా ఉన్న డి.రవికుమార్, బేతంచెర్ల తహసీల్దార్‌గా ఉన్న ఎస్.ప్రకాష్‌బాబు, డోన్ డిప్యూటీ తహసీల్దార్‌గా కె.పురుషోత్తంలను కర్నూలు జిల్లాకు కేటాయించారు.

తహసీల్దార్ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన ప్రదేశం
ఆర్.శివరాముడు	తహసీల్దార్, ఆదోని	ఏఓ, కలెక్టరేట్
సీహెచ్ ఇంద్రాణి	ఎల్ఆర్ విభాగం, కలెక్టరేట్	సూపరింటెండెంట్ మెజిస్టీరియల్ సెక్షన్, కలెక్టర్ ఆఫీస్
ఆర్.గోవింద్ సింగ్	ఆలూరు	సూపరింటెండెంట్ ల్యాండ్ మ్యాటర్స్, కలెక్టర్ ఆఫీసు, కర్నూలు
ఎస్.నజ్మాబాను	హాలహర్వి(లీవ్)	కేఆర్ఆర్‌సీ స్పెషల్ తహసీల్దార్, కలెక్టరేట్, కర్నూలు
ఎస్.శ్రీనాథ్	పెద్దకడబూరు(లీవ్)	ఎల్ఆర్ విభాగం, కలెక్టరేట్ ఆఫీసు, కర్నూలు
కె.కుమార స్వామి	గోనెగండ్ల	స్పెషల్ తహసీల్దార్, కేఆర్ఆర్‌సీ, ఆర్‌డీఓ, కర్నూలు
పి.రాజేశ్వరి	సూపరింటెండెంట్ మెజిస్టీరియల్ సెక్షన్, కలెక్టర్ ఆఫీస్	గోనెగండ్ల
కె.రమాదేవి	తుగ్గలి	మంత్రాలయం
ఎంపీ రమేష్	పత్తికొండ	ఆదోని
డి.రవికుమార్	ఏఓ(నంద్యాల కలెక్టరేట్)	కర్నూలు అర్బన్
డి.వెంకటేష్ నాయక్	కోడుమూరు	గూడూరు
ఈ.వెంకటలక్ష్మి	కర్నూలు అర్బన్	సి.బెళగల్
డి.హుస్సేన్ సాహెబ్	మద్దికెర	పత్తికొండ
ఎస్.ప్రకాష్‌బాబు	బేతంచెర్ల, నంద్యాల జిల్లా	కృష్ణగిరి
ఎస్.రవి	మంత్రాలయం	తుగ్గలి
కె.రామాంజనేయులు	గూడూరు	దేవనకొండ
ఏ.వేణుగోపాల్	సూపరింటెండెంట్ ల్యాండ్ మ్యాటర్స్, ఆర్‌డీఓ కార్యాలయం, కర్నూలు	కోసిగి

మొక్కలు నాటి సంరక్షించండి


మొక్క నాటుతున్న మైనింగ్ శాఖ డీడీ రవిచంద్, ఆర్‌వీఎస్ ఏడీ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మైనింగ్ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) రవిచంద్ సూచించారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన రాయలసీమ జోన్ విజిలెన్స్ స్క్వాడ్ ఏడీ వెంకటేశ్వర్లుతో కలిసి మండల పరిధిలోని బోయనపల్లె కాంతారెడ్డి ఐరన్ ఓర్ మైన్‌లో 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ భూమిపై ప్రతి జీవి మనుగడకు చెట్లు ఆధారమన్నారు. ప్రకృతిలో భాగమైన చెట్ల ద్వారానే మనిషికి శ్వాస, ఆహారం, ఆరోగ్యం, ఆనందం దొరుకుతుందన్నారు. చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు.

నాణ్యత నియంత్రణ డ్యూటీల వైపే మొగ్గు!

- ఆపరేషన్, నిర్వహణ, డ్రైనేజీ విభాగాల్లో డ్యూటీకు వెనుకంజ వేస్తున్న ఇంజినీర్లు

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులంతా నాణ్యత నియంత్రణ విభాగంలోని పోస్టింగ్‌ల కోసమే పోటీ పడుతున్నారు. అత్యంత కీలకమైన సాగు నీటి కాలువలపై నీటి నియంత్రణ, నిర్వహణ విభాగాల్లో పనిచేసేందుకు మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు మినహా మిగిలిన ఏ ప్రాజెక్టుల్లో కూడా పనులు జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఉమ్మడి జిల్లాలో పనులు దాదాపు నిలిచిపోవడంతో నాణ్యతను పరిశీలించే పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. పైగా బదిలీలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫారసుల లేఖలు సమర్పిస్తుండటంతో జల వనరుల శాఖలో కీలక పోస్టులు(ఆయకట్టుకు నీరందించడం, పర్యవేక్షణ) ఖాళీగా ఉండిపోయాయి. సిఫారసుల లేఖలు ఉండడంతో ఉన్నతాధికారులు సైతం ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకోలేని పరిస్థితి వలన గతేడాది కేసీ కాలువ ఆళ్లగడ్డ, తెలుగుంగా, ఎస్ఆర్‌బీసీ కాల్వలపై నీటి నియంత్రణకు ఇంజినీర్ల కొరతతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఏఈఈల కొరతపై జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా ఇటీవల ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక అందజేశారు. 329 మంది ఏఈఈలకు గాను 156 మంది మాత్రమే పని చేస్తున్నారని ఇంకా 173 పోస్టులు ఖాళీగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు.

శ్రీశైలం వైపు చూడని ఇంజినీర్లు

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన ప్రాజెక్టు శ్రీశైలం. ఈ ప్రాజెక్టులో పని చేసేందుకు ఏఈఈలు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ విభాగానికి బదిలీ అంటేనే పనిష్మెంట్‌గా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో 48 మంది ఇంజినీర్లు పని చేయాల్సి ఉండగా కేవలం 11 మందితోనే నెట్టుకొస్తున్నారు. వీరిలో కూడా కొంత మంది పనిభారం భరించలేక అప్పుడప్పుడు సెలవులు పెట్టి తిరిగి వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సాగు, తాగు నీటితో పాటు, విద్యుత్ వెలుగులు నింపుతున్న ప్రాజెక్టులో ఇంజినీర్ల కొరతను చూసి ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు.